
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 10 | మే | 2025



పుష్కరాలకు వైద్యసేవలు
సరస్వతి పుష్కరాల్లో భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది.
- 10లో▸



మానసిక వికాసానికి క్రీడలు దోహదం
- 10లో▸
మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి తెలిపారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం $39^0/26^0$

జిల్లాలో ఉదయం ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

వెదురుతో తయారు చేసిన ఎడ్లబండి, బొమ్మలు, పక్షులు, నెమలిపింఛం, తాబేలు, డేగ











అందాలతారలను ఆకర్షించేలా..
అటవీశాఖ తరఫున అందమైన వెదురు బొమ్మలు


- 20 రోజులపాటు మేదరులకు ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే పూర్తికావొచ్చిన తయారీ
- రామప్పలో స్టాల్ ఏర్పాటుకు ప్రణాళిక

ములుగు: ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ సందర్శనకు ఈ నెల 14వ తేదీన రానున్న 35 మంది అందాల తారలను ఆకర్షించేలా జిల్లా అటవీశాఖ తరఫున ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈమేరకు జంగాలపల్లి గ్రామంలోని 30 మంది మేదరులకు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు శిక్షకుల సమక్షంలో వెదురు బొమ్మల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఇప్పటివరకు వారు చేసిన వెదురుబొంగు గ్లాసులు, డేగ, ఎడ్లబండిపై రైతు దంపతులు, చిలుకలు, విసనకర్ర, తాబేలు, పిచ్చుకలు, పింఛం వదిలిన నెమలి వంటి బొమ్మలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ బొమ్మలను అందాలతారలకు జ్ఞాపికలుగా అందించాలా.. వచ్చేవారంతా చూసేందుకు స్టాల్ ఏర్పాటు చేయాలా? అనే విషయంపై పూర్తి నిర్ణయం తీసుకోలేదు. ఆబొమ్మలకు సుందరీ మణులు ఆకర్షితులైతే వీటికి ఉచిత ప్రచారం జరగడంతోపాటు జిల్లాకు బ్రాండ్ ఇమేజ్ వస్తుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ములుగు జిల్లాకు రెండుసార్లు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అటవీశాఖ ఈ బొమ్మలను అందించగా ఆయన మంత్రముగ్ధుడయ్యారు. మంత్రి సీతక్క.. అధికారులను అభినందించారు. ఈ కోణంలో రామప్పకు వచ్చే సుందరీమణులను ఈ బొమ్మలు ఆకర్షిస్తాయని భావిస్తున్నారు.

బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు



టీ, నీళ్లు తాగే గ్లాసులు



మనకంటూ ఓ బ్రాండ్ వచ్చేలా..



నిర్మల్, పోచంపల్లి వంటి ప్రాంతాలకు వచ్చిన ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ములుగు జిల్లాకు ప్రత్యేక బ్రాండ్ తీసుకొచ్చేలా వెదురు బొంగులతో ప్రత్యేక అందాలను ఇచ్చేలా బొమ్మలను తయారు చేయిస్తున్నాం. రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చే అందాల తారలకు బహుమతులుగా ఇవ్వాలా? స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించాలా? అనేది ఆలోచిస్తున్నాం. ఇప్పటికే 30 మంది మహిళలకు 20 రోజులపాటు శిక్షణ ఇచ్చాం. వారు తయారుచేసిన బొమ్మలు చూడముచ్చటగా, సహజసిద్ధంగా ఉన్నాయి. కచ్చితంగా అందరినీ ఆకర్షిస్తాయని భావిస్తున్నాం.

- రాహుల్ కిషన్ జాదవ్, డీఎఫ్‌ఓ, ములుగు

న్యూస్‌రీల్

టీచర్ల శిక్షణకు డీఆర్పీలు సిద్ధంగా ఉండాలి



విద్యారణ్యపురి: త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఉపాధ్యాయుల శిక్షణకు డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్ (డీఆర్పీ)లు సిద్ధంగా ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి కోరారు. ఐదురోజులుగా హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాస్‌లో రాష్ట్రస్థాయిలో గణితం, సోషల్ స్టడీస్ జిల్లా రిసోర్స్‌పర్సన్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. సమావేశంలో ఎస్‌సీఈఆర్టీ కోర్సు కో–ఆర్డినేటర్లు ఎల్లయ్య, గణపతి, రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు రథంగాపాణిరెడ్డి పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన హనుమకొండ జడ్జి



వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని హనుమకొండ జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి పట్టాభి రామారావు, ములుగు సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్య లాల్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించగా.. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం అందించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ వివరించగా.. రామప్ప శిల్పకళాసంపద బాగుందని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై జక్కుల సతీశ్ ఉన్నారు.

నిట్ బీఓజీ చైర్‌పర్సన్‌గా మోహన్‌రెడ్డి




కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ బీఓజీ (బోర్డ్ ఆఫ్ గవర్నర్స్) చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ డాక్టర్ బీ.వీ.ఆర్ మోహన్‌రెడ్డిని కేంద్ర మంత్రిత్వ శాఖ శుక్రవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్నెళ్ల కాల పరిమితితో చైర్‌పర్సన్‌గా ఆయన కొనసాగుతారు. కాలపరిమితి అనంతరం నూతన చైర్‌పర్సన్ నియామకం జరిగేంత వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. నిట్ వరంగల్ విద్యా సంస్థలో విద్యార్థులకు పరిశ్రమల జ్ఞానం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంలో బీవీఆర్.మోహన్‌రెడ్డి నియామకం అవడం ఆనందంగా ఉందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు.

అధికారులకు అభినందనలు



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ విభాగం 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచినందుకు ఇటీవల హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అభినందనలు తెలియజేస్తూ సర్టిఫికెట్లు డీఆర్డీఓ, డీపీఎంలకు అందజేశారు. ఈమేరకు శుక్రవారం డీఆర్డీఓ మేన శ్రీనివాస్, డీపీఎంలు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు.

అవినీతి జలగలు!
రెచ్చిపోతున్న పన్ను మాఫియా



కనిపించేది ఒకరే..

ఈఅవినీతి తతంగంలో చాచిన చేతులు బయటకు కనిపించేవి ఒకరివే. అయినా ఆ హస్తాలే భాగాలుగా వేసి ఎవరికి ఇవ్వాలో వారికి పువ్వుల్లో పెట్టి అందించడం 'గ్రేటర్'లోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతగా ప్రచారం జరుగుతోంది. అలా చేతులు చాచిన వారంతా కోట్లకు పడగలెత్తినట్లు చర్చ నడుస్తోంది. కాగా.. కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, పాలక వర్గంలోని కొందరు మాత్రం 'ఏసీ' గదుల్లో తిష్ట వేసి చేతికి మట్టి అంటకుండా పచ్చనోట్లు అంటూ.. లెక్కించుకుంటూ దొర బాబుల్లా పెత్తనం కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

- కొత్త ఇంటి నంబర్లు, పేరు మార్పిడిలో మహా మాయ
- ఆస్తి పన్ను పేరిట నిలువు దోపిడీ
- చూసీచూడనట్లుగా ఉన్నతాధికారులు

వరంగల్ అర్బన్: జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్ల వసూళ్ల దందా హద్దు మీరుతున్నట్లు నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇంటి కొలతలకు వచ్చి వెళ్లే సిబ్బందికి రూ.500 ఇవ్వాల్సిందేనని.. కొలతలను అటూఇటుగా మార్చి ఆస్తి పన్ను తగ్గిస్తే రూ.2 వేల నుంచి 3 వేల వరకు తీసుకుంటున్నట్లుగా వారు పేర్కొంటున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అయితే మాత్రం రూ.6 వేల నుంచి రూ.10వేలు. ఆస్తి పన్ను సవరణకు, దరఖాస్తు చేసుకున్న వారి దగ్గర్నుంచి భారీ డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నట్లు రెండు, మూడేళ్లు పని చేస్తే రూ.కోట్లు సంపాదించుకుంటామనే ధీమా ప్రతీ బల్దియా ఉద్యోగుల్లో కనిపిస్తున్నట్లుగా ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు భలే క్రేజ్..

మహానగర పాలక సంస్థలో అన్ని విభాగాల కంటే పన్నుల విభాగంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు భలే క్రేజ్ ఉంటుంది. పట్టుకున్నదంతా బంగారం అయ్యిందన్నట్లుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరితే కాసుల పంటే. అందుకోసమే సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు కోసం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ముట్టజెప్పేందుకు సిద్ధపడుతుంటారు. తదుపరి సంపాదన ఎలా ఉంటుందనే భావనతో పెద్ద మొత్తంలో చెల్లింపులకు పాల్పడుతున్నారు. మహా నగరంలో కొత్తగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇంటి దగ్గర నుంచి నగర పాలక సంస్థ ఆస్తుల పరిరక్షణ వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల కనుసన్నల్లో ఉంటాయి. వీరికి కింది స్థాయిలో బిల్ కలెక్టర్లు ఉంటారు. ఇక పైస్థాయిలో రెవెన్యూ అధికారులు, డిప్యూటీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ అధికారులుగా వ్యవహరిస్తుంటారు. వీరి పాత్ర కీలకం కావడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు క్రేజ్ ఎక్కువగా ఉంటుంది.

ఖరీదైన భవనాలే టార్గెట్..

మహానగర పాలక సంస్థలో 66 డివిజన్లున్నాయి. అపార్ట్‌మెంట్లు, ఖరీదైన భవనాలు, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిని పరిశీలించి పన్నులు వేయాల్సిన పన్నుల విభాగం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిబంధనలను ఆసరాగా చేసుకుంటున్నారు. ఏదైనా ఒక అపార్ట్‌మెంట్‌లో 20 ఫ్లాట్లు ఉన్నాయనుకుంటే.. ప్రతీ ఫ్లాట్‌కు రూ.5వేల చొప్పున రూ.లక్ష చెల్లించాల్సిందే. లేదంటే పన్ను మదింపు రెట్టింపవుతోంది. ఇక ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లకు ప్రత్యేక ధర, ఇంట్లో ఉన్న పడక గదులు మార్బుల్, గ్రానైట్ ఉపయోగంపై పన్నులను ఆర్‌ఐలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఆస్తి పన్ను సవరణలో తేడాలకు పాల్పడుతున్నారు. కొత్త ఇంటి నంబర్ కేటాయింపునకు రూ.5 నుంచి 20వేల వరకు నిర్మాణం ఆధారంగా లంచాలు తీసుకుంటున్నారు. ఖాళీ స్థలాలకు నంబర్ల కేటాయింపులకు రూ.5 నుంచి 20వేల వరకు అంతస్తు ఆధారంగా, నోటరీ దస్త్రాలతో కేటాయింపులకు రూ. 20 వేల నుంచి 30వేల వరకు, పేరు మార్పిడిలు, ఆస్తి విభజన పేరుతో రూ.5 నుంచి 10వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, పార్కులు, లే–ఔట్ స్థలాలు, అసైన్డ్ ల్యాండ్, ప్రభుత్వం భూమి తదితర ప్రాంతాల్లో చేతివాటానికి లెక్క లేకుండాపోతోంది. ఆన్ అసెస్‌మెంట్, అండర్ అసెస్‌మెంట్ పేరుతో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నిబంధనల పేరుతో ఈదోపిడీ బాహాటంగా జరుగుతోంది. బల్దియాకు సమకూరాల్సిన కోట్ల రూపాయల ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. మామూళ్ల రూపంలో వసూలు చేసిన సొమ్మును బిల్ కలెక్టర్‌కు, సూపరింటిండెంట్‌కు, రెవెన్యూ అధికారికి, ద్వితీయ శ్రేణి అధికారుల వరకు వాటాలుగా అందజేస్తున్నారు. దీంతో అవినీతి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మహా నగర పాలక సంస్థ కమిషనర్ ప్రావీణ్య పన్నుల విభాగంలో ఊడలు దిగిన అవినీతిని రూపుమాపాల్సిన అవసరం ఉంది. పారదర్శకంగా పన్నులు విధించి, నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

కాసులు కురిపించే కొర్రీలు..

నిబంధనలను ఆసరాగా చేసుకుని మహా నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం రూ.లక్షల్లో మామూళ్ల వసూలుకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆధునిక హంగులతో నిర్మించిన భవంతులను వారు సాధారణ ఇళ్ల పన్నుగా లెక్కిస్తున్నట్లుగా.. ప్లింత్ ఏరియా అంటూ కొలతల్లో మాయాజాలం సృష్టిస్తున్నట్లుగా తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ కాగితాలు లేకున్నా.. నోటరీలతో ఇంటి నంబర్లు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు లేకున్నా ఉన్నట్లుగా నంబర్లు సృష్టించడం.. రివిజన్ పిటిషన్ల పేరుతో అంతస్తులను ఎగురగొట్టడం పరిపాటిగా మారిందని చర్చ జరుగుతోంది. పెంచిన పన్నులను తగ్గించడం .. ఏదైనా ఒక భవనంలోని కొన్ని గదులు కమర్షియల్ అయినప్పటికీ మొత్తం రెసిడెన్షియల్‌గా, కొన్ని గదులను అద్దెకిస్తున్నప్పటికీ సంబంధిత ఇంటి యాజమాని మొత్తం వాడుకుంటున్నట్లు.. అసలే అసెస్‌మెంట్ చేయకుండా, పిటిషన్ పేరుతో పన్ను తగ్గించడం. దస్త్రాలు కాస్త అటూఇటుగా ఉన్నా.. కొన్ని లేకున్నా నిబంధలకు విరుద్ధంగా పేరు మార్పిడి చేసేస్తూ అవినీతి రోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. ఇలా బల్దియాకు సమకూరాల్సిన కోట్ల రూపాయల ఆదాయాన్ని కొంతమంది అవినీతి అధికారులు కొల్లగొడుతున్నారు. ఈ తతంగంలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారులు మాత్రం పోతే పోనీ మాకెందుకంటూ పైకి మాత్రం సానుభూతితో సరిపెడుతున్నట్లుగా తెలుస్తోంది.

రైతులకు 'విశిష్ట గుర్తింపు'

- కార్డులు అందజేయనున్న ప్రభుత్వం
- ముమ్మరంగా సాగుతున్న నమోదు
- కేంద్ర పథకాలకు ఇకపై ఇదే ప్రామాణికం



హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్‌తో సమానమైన ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయించింది. ఈమేరకు 'ఫార్మర్ రిజిస్ట్రీ పథకం'ను ప్రారంభించింది. ఈ పథకం కింద ప్రతీ రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించనున్నారు. ఇందులో భాగంగా.. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెలాఖరు వరకు దాదాపుగా రైతులందరినీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో నమోదు చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ముందుకు సాగుతోంది.

వివరాలన్నీ ఒకే చోట

హనుమకొండ జిల్లాలో దాదాపు 1.56 లక్షల మంది, వరంగల్ జిల్లాలో 1.56 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇప్పటికే 19 రాష్ట్రాలు కేంద్రంతో ఒప్పందం చేసుకొని నమోదు ప్రక్రియను పూర్తి చేశాయి. తెలంగాణలో వాయిదా పడిన ఈకార్యక్రమాన్ని ఇటీవల చేపట్టారు. 'అగ్రి స్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక యాప్ ద్వారా రైతుల పేర్లు నమోదు చేసి ప్రత్యేక సంఖ్యను కేటాయించనున్నారు. కాగా.. ఈవిశిష్ట నంబర్‌తో కూడిన కార్డుకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. రెవెన్యూశాఖ వద్ద ఉన్న భూయాజమాన్య వివరాలే ప్రామాణికంగా ఉంటాయని వ్యవసాయశాఖ పేర్కొంది. హనుమకొండ జిల్లాలోని రైతులు ఏఈఓలను కలిసి వివరాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ కోరుతున్నారు.

తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచాలి : డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచాలని హనుమకొండ డీఈఓ వాసంతి హెచ్‌ఎంలను కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లాలోని జీరో స్కూల్స్ హెచ్‌ఎంల, 20లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు 'బడిబాట' కార్యక్రమం మొదలయ్యే వరకు వేచి చూడకుండా తల్లిదండ్రులతో మాట్లాడి ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందించే గుణాత్మక విద్య అమలు కోసం నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి డీఈఓ వాసంతి వివరించారు. సమావేశంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మహేశ్, కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, జెండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్ సునీత, రఘుచందర్‌రావు, డీఎల్‌ఎంటీ రఘు, రాజు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వివిధ జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు



అక్రమదాడులపై వెల్లువెత్తిన నిరసన
- 10లో▸

విజయవాడలోని 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి నివాసంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా దాడులు చేయడాన్ని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏపీ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. **- హన్మకొండ అర్బన్**

నాలాల పూడికతీత వేగవంతం చేయాలి

- మేయర్ గుండు సుధారాణి



బొందివాగు నాలాను తనిఖీ చేస్తున్న మేయర్ గుండు సుధారాణి, అధికారులు

వరంగల్ అర్బన్ : నాలాల పూడికతీతలో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరం ముంపు నివారణలో భాగంగా భద్రకాళి, బొందివాగు, నయీంనగర్, దర్గా కాజీపేట, శాకరాశికుంట, చిన్న వడ్డేపల్లి, శివనగర్, వరంగల్ 12 మోరీలు, అలంకార్ బ్రిడ్జి, నంది హిల్స్, జూ పార్క్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన నాలాల పూడికతీత పనులను శుక్రవారం మేయర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పలు చోట్ల బాక్స్ డ్రెయిన్లు, నాలలతో పాటు అంతర్గత నాలాల పూడికతీత సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఆయా పనులు పూర్తిస్థాయిలో జరగాలని సూచించారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఏఈలు ముజమ్మిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ 2.0'కు నగరానికి రూ.3కోట్లు

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా చేపడుతున్న జల్ హీ అమృత్ కార్యక్రమ లక్ష్యాలను అమలు చేసేందుకు వరంగల్ నగరానికి రూ.3కోట్లు కేటాయించిందని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆస్కితో కలిసి నగరంలో చేపట్టనున్న అంశాలపై శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో స్మార్ట్ సిటీ, ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో జల్ హీ అమృత్ కార్యక్రమం స్టార్ రేటింగ్ కోసం హాజరైనట్లు పేర్కొన్నారు. అమృత్ నగరాలకు కేటాయించిన ర్యాంకింగ్‌లో భాగంగా జీడబ్ల్యూఎంసీకి ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించి, అందులో రూ.2.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. నగరంలోని 5, 15 ఎంఎల్‌డీ ఎస్టీపీలలో ఆన్‌లైన్ కంటిన్యూస్ మానిటరింగ్ సిస్టమ్ (ఓసీఈఎంఎస్) ఏర్పాటుకు, ఎస్టీపీ భవనాల మీద సోలార్ ఎనర్జీ తయారీకి ప్యానెళ్లు ఏర్పాటు చేసి ప్రతీరోజు 70 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి, 15 ఎంఎల్‌డీ ప్లాంట్‌లో మురికి నీటిని శుద్ధీకరణకు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ నీటిని పరిశ్రమలకు పంపడానికి (రీ యూజ్) మొత్తంగా రూ.3 కోట్లకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయండి

- ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దానరి హరిచందన



మాట్లాడుతున్న హరిచందన, పక్కన ఇరు జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

హన్మకొండ అర్బన్: హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో నుంచి వెళ్తున్న 163 (జీ) గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి దానరి హరిచందన అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జాతీయ రహదారి 163 (జీ), కాలా ప్రాజెక్ట్ పనుల పురోగతిపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, సీజీఎంఆర్వో శివశంకర్, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి హరిచందన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ.. రెండో దశ ప్రాజెక్టులో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. సరస్వతీ పుష్కరాల తర్వాత భూసేకరణ పనులు మరింత వేగంగా పూర్తి చేయాలన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ రోడ్లకు సంబంధించి భూసేకరణపై ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ వరంగల్, ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, దివ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేంద్రరావు, ఈఈ సురేశ్‌బాబు, ఆర్డీఓలు ఎన్.రవి, ఉమారాణి, సత్యపాల్‌రెడ్డి, రాథోడ్ రమేశ్, నారాయణ, తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరో 4 రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు స్లాట్ బుకింగ్

కాజీపేట అర్బన్: ఈనెల 12వ తేదీ నుంచి(సోమవారం) నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఆర్ఓ, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, నర్సంపేట రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రారంభించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ రంగం సిద్ధం చేసింది. కాగా.. గత నెల 10న వరంగల్ రూరల్, వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా స్లాట్ బుకింగ్ సత్ఫలితాలు ఇవ్వడంతో మరో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ స్లాట్ బుకింగ్‌ను ప్రారంభించనున్నారు. కాగా.. ప్రతీ రోజు ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 48 స్లాట్ బుకింగ్స్, 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. వెంటనే డాక్యుమెంట్లు ఇవ్వనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని మీసేవ కేంద్రాల్లో శిక్షణ కోసం దరఖాస్తులు చేయవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 50 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 17 వరకు గడువు ఉందని, వివరాలకు 9704443476, 9398987337 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుకు నేడు చివరి గడువు

న్యూశాయంపేట: జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంస్థాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కాంట్రాక్ట్ పద్ధతిలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి శనివారం ఆఖరు తేదీ అని వరంగల్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు www. nimsme.gov.inలో సంప్రదించాలని సూచించారు.

కళాశాలలో ప్రవేశానికి కౌన్సెలింగ్

న్యూశాయంపేట: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డీఎస్.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ(జి), పాలకుర్తి(జి), పర్వతగిరి(జి), మూడు చెక్కలపల్లి(జి), నర్సంపేట(బాలుర) కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్లు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తికలిగి పదో తరగతి పాసైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈనెల 15న వరంగల్ నగరంలోని యాకూబ్‌పురలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 94909 57296 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

14 కిలోల గంజాయి పట్టివేత



కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ ఆవరణలో 14.7 కిలోల ఎండు గంజాయిని శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వేముల చంద్రమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షహనావాస్ కాశీం ఆదేశం మేరకు జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు పర్యవేక్షణలో రైల్వే జంక్షన్‌లో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒడిశా నుంచి వచ్చే రైళ్లలో గంజాయి రవాణా జరుగుతున్నట్లుగా అందిన ముందస్తు సమాచారం ఆధారంగా రైళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం జంక్షన్‌లో ఓ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆగి తనిఖీ చేయగా.. రూ.90 వేలు విలువైన గంజాయి లభించగా కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి, ఖలీల్, లాలయ్య, కోటిలింగం, ఆయుర్, రషీద్ పాల్గొన్నారు.

ఇద్దరి దుర్మరణం

మరిపెడ: రెండు బైక్‌లు ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మరిపెడ మండలం బాబోజీగూడెం గ్రామ శివారు వెంకురాం తండాకు చెందిన భూక్య సంతోష్ (30), భోజ్యతండాకు చెందిన గుగులోతు కార్తీక్ (35) స్నేహితులిద్దరు కలిసి గురువారం రాత్రి తండా నుంచి మరిపెడ మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. బావోజీగూడెం శివారు వాగోడ్డు తండాకు చెందిన అజ్మీర సుధీర్ మరో ద్విచక్రవాహనంపై వారు వెళ్తున్న దారిలో వెళ్తున్నాడు. మరిపెడ మున్సిపాలిటీ సమీపంలోని 365జాతీయ రహదారిపై అతివేగం కారణంగా ఆ రెండు బైక్‌లు పరస్పరం ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. సుధీర్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అజ్మీరా లాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుష్కరాలకు వైద్యసేవలు

కాళేశ్వరంలో 10 వైద్యశిబిరాలు
- ఒక్కో శిబిరంలో 10 పడకలు
- 36 మంది వైద్యులు, 450 మంది సిబ్బంది
- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు





భూపాలపల్లి అర్బన్: ఈనెల 15నుంచి 26వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద నిర్వహించనున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యశిబిరాలు, మెడికల్ క్యాంపుల్లో వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిని నియమించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నుంచి స్పెషలిస్టు వైద్యులను కేటాయించారు.

తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు

కాళేశ్వరం పీహెచ్‌సీలో తాత్కాలికంగా 10 పడకలను ఏర్పాటు చేసి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్సిజన్, పల్స్‌మీటర్, ఈసీజీ సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందులో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, స్టాఫ్ నర్సులను నియమించనున్నారు.

పీహెచ్‌సీలకు ఇబ్బంది కలగకుండా..

కాళేశ్వరంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొననున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 11 రోజులపాటు ఇబ్బందులు కలగకుండా వైద్యాధికారులు, సిబ్బంది కేటాయించారు. ఆర్‌బీఎస్‌కే, పల్లెదవాఖాలు, పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటే ఒక్కొక్కరిని, సిబ్బందిని కూడా అదే విధంగా ఎక్కువ మంది ఉన్న సిబ్బందిని కాళేశ్వరం విధులకు పంపించే విధంగా ఏర్పాట్లు చేశారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణ

కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవిని నియమించారు. వైద్య సిబ్బందికి విధులు కేటాయించి వారు అందిస్తున్న సేవలు, ఇబ్బందులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా రెండు మానిటరింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేయనున్నారు.

10 చోట్ల క్యాంపులు

కాళేశ్వరంలో 11 రోజులపాటు మూడు షిప్టులో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. ముక్తీశ్వర ఆలయ సమీపం, పాత ఈఓ కార్యాలయం, టెంట్ సిటీ, పార్కింగ్ –1, పార్కింగ్–2, పార్కింగ్ –3, హరిత హోటల్, గోదావరి మెయిన్ ఘాట్, వీఐపీ ఘాట్, హెలిపాడ్ దగ్గరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలో 10 పడకలతో తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్(ఎంఎల్‌హెచ్‌పీ), హెల్త్ సూపర్‌వైజర్, ఇద్దరు చొప్పున ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లను నియమించారు. వ్యాధి తీవ్రతను బట్టి అత్యవసరమైతే మహాదేవపూర్‌లోని సీహెచ్‌సీకి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవలు



కాళేశ్వరం పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఆరోగ్య పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశాం. వేసవికాలం కావడంలో ఇక్కడికి వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలి. దగ్గు, జలుబు, ఇబ్బందులు ఎదురైనట్లయితే వెంటనే వైద్యశిబిరాలను సంప్రదించాలి. ఎక్కువసేపు ఎండలో తిరగొద్దు. మధ్యాహ్న సమయంలో స్నానం చేయకపోవడమే మంచిది. రోజూ ఒక్కో క్యాంపులో 2వేల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తాం.

– మధుసూదన్, డీఎంహెచ్‌ఓ



'కాళేశ్వరం' అప్పుడు.. ఇప్పుడు



ప్రస్తుతం కాళేశ్వరాలయం



1975కు ముందు శిథిలావస్థలో ఉన్న కాళేశ్వరం దేవస్థానం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం 1975కు పూర్వం శిథిలావస్థలో ఉండేది. అప్పటి వరకు కీకర దండకారణ్యం కావడంతో కాకులు దూరని కారడవిగా ఉండే ఆలయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అప్పటి రవాణాశాఖ మంత్రి జువ్వాడి చొక్కారావు ప్రత్యేక చొరవ తీసుకొని జీర్ణోద్ధరణ కమిటీ వేసి పనులు ప్రారంభించారు. కమిటీలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, అప్పటి కలెక్టర్ ఇతరులు సభ్యులుగా ఉన్నారు. రోడ్డు, రవాణా, విద్యుత్, కనీస అవసర సదుపాయాలు కల్పించారు. 1982లో శృంగేరి శారద పీఠాధిపతులు విద్యాతీర్థమహాస్వామి, భారతీతీర్థస్వామి చేతుల మీదుగా కుంభాభిషేకం చేసి జీర్ణోద్ధరణ జరిపారు. తర్వాత దేవస్థానం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ అనేక మార్పులు సంతరించుకున్నాయి. నాడు పదుల సంఖ్యలో వచ్చే భక్తులు.. ప్రస్తుతం వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రస్తుతం దేవాలయం వార్షికాదాయం రూ.6 కోట్లకు చేరింది. రోడ్డు, రవాణా, అంతర్రాష్ట్ర వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థ పెరిగింది. దేవస్థానం దేశవ్యాప్తంగా కీర్తి పొందుతూ ప్రాచుర్యంలోకి వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2016లో అప్పటి సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో రూ.25కోట్ల వరకు నిధులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి. ఈనెల 15 నుంచి 26 వరకు సరస్వతీనది పుష్కరాలను ప్రభుత్వం నిర్వహించనుంది. పుష్కరాల ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. త్రివేణి సంఘమైన(గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతీనది) కాళేశ్వరంలో 12ఏళ్లకోసారి ఒక్కో నదికి పుష్కరాలు నిర్వహిస్తుంటారు.

గోడలకు దేవతామూర్తుల చిత్రాలు



గోడకు దేవతామూర్తి చిత్రం వేస్తున్న ఆర్టిస్ట్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఖాళీగా ఉన్న గోడలు, భవనాలకు దేవతామూర్తుల చిత్రాలను వేస్తున్నారు. గురువారం నుంచి ఆలయ పరిసరాల్లో చిత్రాలు వేసే పనులు ప్రారంభమయ్యాయి.

వీవీఐపీ హెలిపాడ్ సిద్ధం



హెలిపాడ్ వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల సందర్భంగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో వీవీఐపీ హెలిపాడ్ సిద్ధం చేస్తున్నారు. హెలిపాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు గురువారం చేపట్టారు. కన్నెపల్లిలో మూడు హెలిపాడ్‌లు ఉన్న విషయం తెలిసిందే. మొత్తం నాలుగు హెలిపాడ్‌లు సిద్ధంగా ఉన్నాయి.

సరస్వతీ ఘాట్ వద్ద 50 ఎకరాల్లో పార్కింగ్



వీఐపీ ఘాట్ వద్ద వాహనాల పార్కింగ్ కోసం చదును చేసిన స్థలం

కాళేశ్వరం: కాళేశ్వరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, వీఐపీల కోసం సుమారు 50 ఎకరాల్లో పార్కింగ్ సిద్ధం చేస్తున్నారు. ఏడు డోజర్లతో చదును చేస్తున్నారు. ప్రైవేట్ వావానాలు ఘాట్ వరకు వచ్చే విధంగా పార్కింగ్ పనులను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

పుష్కరాల్లో కళాకారుల ప్రదర్శనలు

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల్లో ప్రత్యేక కళాకారులు, వివిధ రంగాల కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. మొత్తం 235 మంది కళాకారులు ప్రతిరోజూ సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, జానపద గీతాలు, కథక్, బుర్రకథ, పేరిణి, కడ్డి తంత్రి, భక్తిగీతాలు, చిందు, ఒగ్గు, మోహిని అట్టం, ఆంధ్ర నాట్యం, భక్తి సంగీతం, సురభి నాటకం ప్రదర్శించనున్నారు.

సరస్వతీమాత విగ్రహానికి వస్త్రం తొడుగు



సరస్వతీమాత విగ్రహానికి తొడిగిన వస్త్రం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగనున్న సరస్వతినది పుష్కరాల సందర్భంగా సరస్వతిమాత విగ్రహాన్ని బుధవారం స్థిరప్రతిష్ఠ చేశారు. కాగా, ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న నేపథ్యంలో శిల్పులు, స్థపతి ఆధ్వర్యంలో సరస్వతిమాత విగ్రహానికి, నలుగురు వేద మూర్తుల విగ్రహాలకు గురువారం వస్త్రం తొడిగి కనిపించకుండా కప్పేశారు.

అత్యవసర సమయాల్లో రెడ్ క్రాస్

- సీపీ సన్‌ప్రీత్ సింగ్



తలసేమియా కేంద్రంలో చిన్నారితో మాట్లాడుతున్న సీపీ సన్ ప్రీత్ సింగ్

హన్మకొండ అర్బన్: అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో వేడుకలను రెడ్‌క్రాస్ పాలకవర్గం ఘనంగా నిర్వహించింది. సొసైటీలోని తలసేమియా సెంటర్‌ను సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ రక్త కేంద్రం, తలసేమియా సెంటర్, జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరాల నిర్వహణ కేటగిరిలో కిట్స్ వరంగల్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించి 540 యూనిట్ల రక్తం సేకరించి రెడ్ క్రాస్ రక్త కేంద్రానికి అందచేసినందుకు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సతీశ్‌చంద్రను సీపీ సన్‌ప్రీత్‌సింగ్, పాలకవర్గం శాలువా, షీల్డ్‌తో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, సుధాకర్ రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ల రమణారెడ్డి, బాశెట్టి హరిప్రసాద్, ప్రొఫెసర్ పాండురంగారావు, కన్సల్టింగ్ ఇంజనీర్ కె.సత్యనారాయణరావు, బన్ను ఆరోగ్య ది సేవా సొసైటీ ప్రతినిధులు వీరమల్ల కిరణ్‌కుమారి, చంద్రజిత్‌రెడ్డి, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు, తలసేమియా బాధితులు, రెడ్ క్రాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సీపీ అభినందన

వరంగల్ క్రైం: అత్యధికసార్లు రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ కన్నె రాజు, కేయూ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సుబేదారి రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కన్నె రాజు 37వ సారి, రవీందర్ 18వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేయగా.. వారిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

నేటితో ముగియనున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు



శరభ వాహనసేవలో పాల్గొన్న గౌడ సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

హన్మకొండ కల్చరల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న భద్రకాళి, భద్రేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ శేషుభారతి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు నేతృత్వంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా శతుష్టార్చన పూజలు నిర్వహించిన అనంతరం భద్రకాళి అమ్మవారికి ఉదయం శరభ వాహన సేవ, సాయంత్రం పుష్పరథ సేవ జరిపించారు. ఈ పూజాది కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ప్రతినిధులు.. ఉభయ దాతలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, బీసీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, రాష్ట్ర నాయకులు జనగాం శ్రీనివాస్‌గౌడ్, బత్తిని సుదర్శన్ గౌడ్, కుమారస్వామి, కార్పొరేటర్ పోశాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం తగదు



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, వివిధ జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు

- జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

హన్మకొండ అర్బన్: సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి ఇంట్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా చొరబడి సోదాలు చేయడాన్ని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఏపీ పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వ తీరుపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సాక్షి పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏపీ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పత్రికా స్వేచ్ఛను హరించేలా ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, రాష్ట్ర నాయకులు వల్లాల వెంకటరమణ, గాడిపెల్లి మధు, వేణుమాధవ్, యూనియన్ ప్రతినిధి తోట సుధాకర్, టీయూడబ్ల్యూజే –143 హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్, కోరుకొప్పుల నరేందర్, వాంకె శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పిన్నా శివకుమార్, అబ్బు వెంకట్‌రెడ్డి, అల్లం రాజేష్ వర్మ, సదానందం, ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టు సంఘాల నుంచి తిరుపతి, గొట్టె వెంకట్, సంపెట వెంకటేశ్వర్లు, వరప్రసాద్, ఐజేయూ – టీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు ఊటుకూరు సాయిరాం, సీనియర్ జర్నలిస్టులు అల్వాల సదాశివుడు, కోలా కృష్ణకుమార్ రెడ్డి, అహ్మద్, బత్తిని రాజేందర్, రమేష్, నరేందర్, వెంకటస్వామి, సుధాకర్, నాగరాజు, రమేష్, అనిల్, రాజిరెడ్డి, శ్రీనివాస్, డెస్క్ జర్నలిస్టులు మహేష్, ఓంకార్, రవికుమార్, అశోక్, రాజు, రమేష్, దాసరి బాబు, రాంచందర్ రావు, రామాచారి, శ్రావణ్, శ్రీనివాస్, మధుసూదన్, పాత్రికేయులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి
- వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని, బాల్యం నుంచే ఏదో ఒక క్రీడను ఎంచుకుని అందులో రాణించాలని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నెలరోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని కేఎంసీ మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రత్యేక శిక్షణ శిబిరాల ద్వారా సరికొత్త మెళకువలు నేర్చుకోవాలని క్రీడాకారులకు చెప్పారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా కేఎంసీ మైదానం.. ఎంతో మంది జాతీయస్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డబ్ల్యూసీఏ ఉపాధ్యక్షులు సదాశివ, రాము, కార్యవర్గ సభ్యుడు అభినవ్ వినయ్, కోచ్ గోవింద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. కుక్క పిల్లకు జ్యూస్



కుక్క పిల్లకు శీతల పానీయం తాగిస్తున్న మహిళ

వెంకటాపురం(కె): ఎండలు మండుతుండడంతో ప్రజలు ఎండ వేడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేడి నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు, జ్యూస్‌ల వైపు మొగ్గు చూపుతన్నారు. ఈక్రమంలో అంబేద్కర్ నగర్‌కు చెందిన ఓ మహిళ.. తన పెంపుడు కుక్కపిల్ల ఎండ వేడిమి తట్టుకోలేక అవస్థ పడుతుండటంతో దానికి శుక్రవారం శీతల పానీయం తాగించడం గమనార్హం.



సుందరీమణుల రాకకు సుందరంగా..

ఖిలా వరంగల్: ప్రపంచ సుందరీమణుల రాకకు కోట సుందరంగా ముస్తాబవుతోంది. శుక్రవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో శిల్పకళా సంపద మరింత అందంగా, ఆకర్షణీయంగా కనివిందు చేస్తోంది. ఈ సందర్భంగా కాకతీయుల రాజధాని మధ్యకోటలో జరుగుతున్న పనులను కుడా, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం పరిశీలించారు. శిల్పాల ప్రాంగణం, కోట రోడ్డుకు ఇరువైపులా మరింత సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ తగిన ఏర్పాట్లు చేసింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో శిల్పకళా వైభవాన్ని సుందరీమణుల వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా రాత్రి శిల్పాల ప్రాంగణంలో ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు అజిత్‌రావు, భీమ్‌రావు, బల్దియా అధికారులు, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సౌండ్ అండ్ లైటింగ్ షో ఇన్‌చార్జ్ అజయ్, గైడ్ దేనబోయిన రవియాదవ్, డీఈ మల్లికార్జున్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో వెలుగులీనుతున్న కోటలోని శిల్పాల ప్రాంగణం